సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 9 । మే । 2024



తలసేమియా దినోత్సవం

విశాఖ: ఇంటర్నేషనల్ తలసేమియా డే పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అవగాహన కార్యక్రమం నిర్వహించింది.



మన్యంలో భారీ వర్షం

సాక్షి,పాడేరు: జిల్లాలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, హుకుంపేటలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.




పుస్తకాల బహూకరణ

ఏయూ లాకాలేజీ లైబ్రరీకి తాను రచించిన ఎవిడెన్స్, కాంట్రాక్ట్ యాక్ట్ పుస్తకాలను విశ్రాంత ఆచార్యుడు కేశవరావు బహూకరించారు.

- దత్తత గ్రామం పెదలబుడును స్మార్ట్ విలేజ్‌గా మార్చేస్తానంటూ డప్పు కొట్టుకున్న చంద్రబాబు
- రూ.5 కోట్లతో మంచినీరు, రూ.9 కోట్లతో సిమెంట్ రోడ్లు వేస్తానని హామీ
- రక్షిత నీటి పథకానికి ఖర్చు చేసింది రూ.32 లక్షలు మాత్రమే
- గ్రంథాలయం నిర్మించినా పుస్తకాలు లేకుండా వదిలేసిన టీడీపీ ప్రభుత్వం
- జేబులోంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని వైనం
- ప్రతి ఇంటినీ అభివృద్ధి పథంలో నడిపించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రూ.37 కోట్లతో సంక్షేమ పథకాలు
- రూ.32 కోట్లతో రోడ్లు, ప్రాధాన్యత భవనాలు, మౌలిక వసతులు

పెదలబుడుకు బాబు ఝలక్

దత్తత ఉత్తదే..



సాక్షి, విశాఖపట్నం/అనంతగిరి : ఊరిని దత్తత తీసుకోవడమంటే.. నాలుగు రోడ్లేసి.. రెండు బిల్డింగులు కట్టియ్యడం కాదు.. ప్రతి మనిషికీ భరోసా నివ్వడం.. ప్రతి కుటుంబానికి చేయూతగా నిలవడం.. ప్రతి గడపకు అభివృద్ధిని పరిచయం చెయ్యడం. కానీ.. చంద్రబాబు దృష్టిలో దత్తత అంటే అర్థం వేరు..

స్మార్ట్ విలేజ్‌గా మార్చేస్తా.. ప్రతి ఇంటికీ నిరంతరం నీటిని అందించే వ్యవస్థ తీసుకొస్తా.. మీ బతుకులు మారుస్తా.. అంటూ బీరాలు పలకడమే.!

కట్ చేస్తే.. ఆ ఊరి బతుకూ మారలేదు.. ఏ ఇంటికీ నిరంతరం నీరూ అందడం లేదు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో దత్తత తీసుకున్న గ్రామానికి ఆ ఉత్తపుత్రుడు చంద్రబాబు వెళ్లింది ఒకే ఒకసారి. చేసిందేమో అరకొరే.

కానీ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. బాబు దత్తత తీసుకున్న గ్రామంలోని ప్రతి ఇంటి సామాజిక, ఆర్థిక స్థితిగతులు మారిపోయాయి. ఇంతకీ ఆ ఉత్తపుత్రుడు చంద్రబాబు దత్తత గ్రామమైన అరకు నియోజకవర్గంలోని పెదలబుడు పంచాయతీ వాస్తవ పరిస్థితుల్ని ఓసారి పరిశీలిద్దాం.

మేజర్ పంచాయతీ పెదలబుడు... దీని పరిధిలో పెదలబుడు, అరకువేలి, పానిరంగిని సహా 28 గ్రామాలున్నాయి. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా 2015 జనవరిలో ఈ పంచాయతీని దత్తత తీసుకుంటున్నట్లు అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏడాదిన్నర వరకూ గానీ.. ఆ ఊరి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. చంద్రబాబు సంగతి ముందే తెలిసి.. ఆ పంచాయతీ ప్రజలు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బీరాల బాబు.. ఆగమేఘాలపై 2016 ఆగస్టు 8న పెదలబుడు వచ్చేసి.. చదువు రానిగిరిజన ప్రజలతో తనకొచ్చిన సాఫ్ట్‌వేర్ భాషలో మాట్లాడేశారు. పెదలబుడును స్మార్ట్‌విలేజ్ చేస్తానని ప్రక టించారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలకు రూ.5 కోట్లు, సిమెంట్ రోడ్లకు రూ.9 కోట్లు మంజూ రు చేస్తున్నట్లు చెప్పేశారు. ఊరంతా మార్చేస్తానని చెప్పిన ఆయన 2017 వచ్చినా పట్టించుకోలేదు.

సొంతంగా ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా..

దత్తత తీసుకున్నారంటే.. చంద్రబాబు తన సొంత నిధులతో ఒక్కపనైనా చేస్తారని అంతా భావించారు. కానీ.. బాబు జేబులోంచి రూపాయి కూడా తీయకుండానే పనులు మొదలు పెట్టేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో 2018లో చంద్రబాబు ఆయా గ్రామాల్లో తాగునీటి పథకాలు, సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు, వంతెన నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను తూతూమంత్రంగా ప్రారంభించారు. ప్రభుత్వ నిధులతో నిర్మాణ పనులను చూపించి, తానే ఏదో అభివృద్ధి చేసేశానంటూ డప్పుకొట్టుకున్నారు. రూ.5 కోట్లతో మంచినీరు అని చెప్పి.. చివరికి పెదలబుడు పంచాయతీ కేంద్రంలోని 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.32 లక్షలతో 2 రక్షిత తాగునీటి పథకాలను నిర్మించారు. ప్రస్తుతం చాలా ఇళ్లకు నీరు రాని దుస్థితికి చేరుకున్నాయి. రూ.3లక్షల ఎన్‌ఆర్‌యూఎం నిధులతో బస్‌షెల్టర్, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నిధులతో రూ.20 లక్షలతో అంగన్వాడీ కేంద్రం, రూ.25 లక్షలతో సామాజిక భవనం, రూ.10 లక్షల ఎస్‌డీపీ నిధులతో గ్రంథాలయం నిర్మించారు. ఆర్ అండ్‌బీ నిధులు రూ.9 కోట్లతో 52 సీసీ రోడ్లు వేస్తామని చెప్పి.. కేవలం 14 రోడ్లు నిర్మించి మమ అనిపించేశారు. అధికారం పోయిన తర్వాత.. కనీసం దత్తత గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీలన్నీ గాలిలోనేనా బాబూ..?

దత్తత పంచాయతీ పరిధిలోని గ్రామాలన్నింటికీ ఆకాశానికి నిచ్చెన వేసేస్తానంటూ గొప్పలు చెప్పిన చంద్రబాబు.. హామీలన్నీ తూర్పు కనుమల్లో కలిపేశారు. డ్రైనేజీ పనులు సక్రమంగా చేయక ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయాన్ని నిర్మించి.. అందులో ఒక్క పుస్తకం కూడా ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. పెదలబుడు సమీపంలోని గెడ్డపై వంతెన నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చి హామీను విస్మరించారు. వర్షాకాలంలో వాగును దాటలేక గ్రామానికి చేరుకునేందుకు దుమ్మగుడ్రి, నువ్వగూడ మీదుగా 15 కిలో మీటర్లు ప్రయాణించి పెదలబుడు చేరుకోవాల్సిన దుస్థితి దాపురించింది. సీసీ రోడ్లు గ్రామ శివార్లవరకూ నిర్మించలేదు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా కొందరికి ఇళ్ల మంజూరు చేసినా.. తమకు అనుకూలంగా లేనివారికి బిల్లులు చెల్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది.

పాలన మారింది.. గ్రామం మారింది: దత్తత పేరుతో ఉత్త హామీలిచ్చి చంద్రబాబు చేతులు దులిపేసుకున్నా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. పెదలబుడు పంచాయతీలో ప్రతి ఇల్లూ అభివృద్ధి పథంలో నడుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూతనందుతూ.. కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించింది.. గతంలోని కనీస మౌలికసదుపాయాలకు నోచుకోని గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. పెదలబుడు మేజర్ పంచాయతీలో ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులను వెచ్చించడంతో గిరిజనులు హర్ష వ్యక్తం చేస్తున్నారు. నేడు ప్రజల వద్దకే పాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడంతో సేవలు మరింత దగ్గరయ్యాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిల్లోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్‌సెంటర్ అందుబాటులోకి రావడంతో చంద్రబాబు దత్తత తీసుకున్నప్పుడు జరగని మేలు.. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిందంటున్నారు. మూడు సచివాలయాల పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.37 కోట్ల లబ్ధిని ప్రజలు పొందారు.

టీడీపీ హయాంలో..



చుక్కనీరివ్వని ఇంటింటి కుళాయి



పెదలబుడులో డ్రైనేజీ లేక రోడ్డుపైకి మురుగునీరు

వైఎస్సార్‌సీపీ హయాంలో..



అరకులోయలో నిర్మించిన అగ్రి ల్యాబ్



అరకులోయలో నిర్మించిన సచివాలయం

బాబు మాటల్లోనే స్వర్గం



మా గ్రామం దత్తత పంచాయతీ కావడంతో అభివృద్ధి సమస్యలు తీరుతాయి అనుకున్నాం. అప్పుడొకసారి చంద్రబాబు మా ఊరు వచ్చి.. మాటల్లోనే స్వర్గం చూపించేశారు. మేము ఏదేదో ఊహించుకున్నాం. కానీ.. మా పక్క ఊరిలో ఏం చేశారో.. మా ఊరిలోనూ అవే.. సీసీరోడ్లు, తాగునీటి పథకం నిర్మించారు. అంతకు మించి ఏమీ తేడా కనిపించలేదు. డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా నిర్మించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– **వంతాల దేవి**, గిరి మహిళ, పెదలబుడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులివీ..

- పెదలబుడులో రూ.89 లక్షలతో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం.
- అరకులోయలో రూ.2.55 కోట్లతో అందుబాటులోకి వచ్చిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అగ్రిటెస్టింగ్ ల్యాబ్, ప్రాంతీయ పశు సంవర్ధకశాఖ భవనం నిర్మాణం.
- పానిరంగినిలో రూ. 68 లక్షలతో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు



పానిరంగిని వద్ద రూ.12 కోట్లతో నిర్మిస్తున్న డిగ్రీ కళాశాల భవనం

- పానిరంగిని వద్ద రూ.12 కోట్లతో మహిళ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు 90 శాతం పూర్తి
- ఐటీడీఏ నుంచి ఎండపల్లివలస వరకు రూ. 14కోట్లతో రోడ్డు విస్తరణ పనులు
- ఐటీడీఏ నుంచి ఎండపల్లివలస వరకు రూ.14కోట్ల రోడ్డు విస్తరణ పనులతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరింది.
- పెదలబుడు పంచాయతీ కేంద్రంలో సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్‌సెంటర్ భవనాల సుమారు రూ.89 లక్షలతో పనులు జరుగుతున్నాయి. రూ.45లక్షలతో సచివాలయం పనులు జరుగుతున్నాయి.
- శ్మశాన వాటికకు రూ.20లక్షలు పంచాయతీ నిధులు వెచ్చించి, సీసీరోడ్డు వేశారు. అదే గ్రామంలోని రచ్చబండని రూ.4లక్షలతో నిర్మించారు.

జగనన్న ప్రభుత్వంలో మేలు



చంద్రబాబు మా ఊరిని దత్తత తీసుకున్నారంటే.. మా కుటుంబాలన్నింటినీ తీసుకున్నట్లే అనుకున్నాం. కానీ.. కేవలం రోడ్లు, రెండు బిల్డింగులు కట్టేసి వదిలేశారు. కానీ.. జగనన్న ప్రభుత్వంలో మా ఊర్లో చాలా మందికి మేలు జరిగింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. నా కుటుంబానికి ఈ ప్రభుత్వం గొప్ప మేలు చేసింది.

– **ఎల్ కుమారి**, గిరిజన మహిళ, పెదలబుడు

దత్తత కాకున్నా అభివృద్ధి చేస్తున్నారు



మా ఊరిని చంద్రబాబు ప్రభుత్వంలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దత్తత తీసుకోలేదు. కానీ.. అప్పటి కంటే ఇప్పుడే అభివృద్ధి బాగా జరిగింది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మా పరిధిలోని గ్రామాలు, అభివృద్ధి పథంలోని నడుస్తున్నాయి. విద్య, వైద్యం, అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలుచేయడంలో సీఎం వైఎస్ జగన్ ఎనలేని కృషి చేశారు.

– **పట్టాసి సంపత్‌కుమార్**, గ్రామస్తుడు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ



పాడేరులో క్యూలో నిల్చున్న ప్రభుత్వ ఉద్యోగులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాలలో బుధవారం ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. బుధవారం 1676 మంది ఓటుహక్కును వినియోగించుకోగా, ఈ ఐదు రోజులకు గాను 9188 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలైనట్లు తెలిపారు.

బాధితులు ఆధారాలు చూపిస్తే నష్ట పరిహారం

జి.మాడుగుల: జాతీయ రహదారి 516ఈ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు, షాపులు, భూములు తదితర ఆస్తులు కోల్పోతున్న బాధితులు వాటి ఆధారాలు చూపిస్తే తగిన నష్టపరిహారం చెల్లిస్తామని హైవే నిర్మాణ విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లంబసింగి నుంచి జి.మాడుగుల మీదుగా పాడేరు వరకు హైవే 516ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందులో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, షాపులు కోల్పోతున్న వారు అఫిడవిట్ చేయించి ఆధార్‌కార్డు, రేషన్, బ్యాంకు పాస్ పుస్తకం, కరెంట్ బిల్లు తదితర పత్రాలు సిద్ధంగా ఉంచాలని వారు తెలిపారు. త్వరలో వీటిని పరిశీలించి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. జి.మాడుగుల మండల కేంద్రంలో ఉరుము జంక్షన్ నుంచి పీహెచ్‌సీ జంక్షన్ వరకు 130 మంది బాధితులు ఉన్నారని.. వీరందరికీ నష్టపరిహారం అందిస్తామని వారు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా 12 మీటర్ల మేర వెడల్పు చేస్తామని వారు తెలిపారు.

కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వై.రామవరం ఎగువ ప్రాంతంలో ప్రచారరథంపై మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి ధనలక్ష్మి



దొంకరాయిలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

- భారీగా రోడ్‌షో, బైక్ ర్యాలీ నిర్వహణ
- ప్రచారం నిర్వహించిన రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి

మోతుగూడెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాయని రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో బుధవారం వై.రామవరం మండలం సింధువాడ, మంగంపాడు, బచ్చులూరు, దొంకరాయి వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున రోడ్‌షో, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఆయనతో మాత్రమే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోవద్దని ఆమె కోరారు.గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ఆయన అమలు చేయలేదన్నారు. డ్వాక్రా రుణ మాఫీ, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలను గాలికొదిలేశారని విమర్శించారు.



ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కుమిడిపుట్టులో ఆమె బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీ అభ్యర్థి మత్స్యలింగం, ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజ రాణిని గెలిపించాలని కోరారు.

ప్రజలతో మమేకం.. వినూత్నంగా ప్రచారం





అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయన బుధవారం హుకుంపేటలో ట్రాక్టర్ నడుపుతూ.. టైలర్ వద్ద దుస్తులు కుడుతూ..రజకుడి వద్ద దుస్తులు ఇస్త్రీ చేస్తూ, కూరగాయలు అమ్ముతూ ప్రజలను ఆకట్టుకున్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను, అరకు ఎంపీ అభ్యర్థిగా గుమ్మా తనూజారాణిని గెలిపించాలని కోరారు.

– అనంతగిరి

లోయలోకి దూసుకెళ్లిన ఆటో

- 9 మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషయం
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



లోయలోకి దూసుకెళ్లిన ఆటో



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వంతాల కొండబాబు

పెదబయలు : మండలంలోని పెదకోడాపల్లి ఘాట్‌లో గురువారం సాయంత్రం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో 9 మంది గాయపడ్డారు. ప్రయాణికులు అందించిన వివరాలివి. హుకుంపేట మండలం చిలకలమామిడి గ్రామానికి చెందిన 8 మంది ఆటోలో పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ బంగారుమామిడి గ్రామానికి తమ బంధువుల పెద్దకర్మ కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా పెదకోడాపల్లి ఘాట్‌లో మలుపు వద్ద ఆటో, ఎదురుగా వస్తున్న బైకు ఢీకొన్నాయి. దీంతో ఆటో 20 అడుగుల లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కుంతుర్ల పంచాయతీ ఉరుగొండ గ్రామానికి చెందిన వంతాల కొండబాబు(37)కు తలకు తీవ్రగాయమైంది. ఆటోలో ప్రయాణిస్తున్న పాంగి బుట్టోలు, మర్రి జంబో, మర్రి ఈశ్వరరావు, మర్రి మార్కిడి, మర్రి హెలీషా, మర్రి ప్రసాద్, వంతాల బొంజు , మర్రి సంజు గాయపడ్డారు. బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తప్పించే క్రమంలో ఆటో లోయలోకి దూసుకెళ్లి తుప్పల్లో బోల్తా పడింది. ఇదే రోడ్డులో ఎన్నికల ప్రచారానికి వెళ్లి తిరిగి వస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, సందడి కొండబాబు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, నాయకులు రూడ లక్ష్మణరావు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించి ఆస్పత్రి వైద్యాధికారులతో మాట్లాడారు. అందరూ ప్రస్తుతం పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెదబయలు పోలీసులు కేసు నమోదు చేశారు.



పాడేరు : పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రచారం ముమ్మరం చేశారు. మండలంలోని వంతాడపల్లి, గుజ్జెలి, తుంపాడ, కిండంగి, కాదేలి, లిగిసిపల్లి పంచాయతీల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని వారు కోరారు.



చింతపల్లి రూరల్: ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతోనే గిరిజన చట్టాలకు రక్షణ ఉంటుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అన్నారు. మండల కేంద్రం చింతపల్లిలో బుధవారం అరకు సీపీఎం, పాడేరు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ అభ్యర్థులను ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు.



రంపచోడవరం: స్థానిక ఎమ్మెల్యే, రంపచోడవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి ప్రచారం ముమ్మరం చేశారు. నియోజకవర్గంలోని మండలాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. సింధువాడ, మంగంపాడు, బచ్చులూరు, దొంకరాయి ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు.

జగనన్నతోనే పేదల జీవితాల్లో వెలుగులు



కుంతుర్ల గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం



సమ్మగిరిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

హుకుంపేట: మండలంలోని మట్టుజోరు, తీగలవలస, తడిగిరి పంచాయతీల్లో పలు గ్రామాల్లో అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్నతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి పొందేందుకు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.నియోజకవర్గ ప్రాంతాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు మత్యరాస వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీయస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి బూషణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సర్పంచ్‌లు ఎస్.సాంబ, పి.బేసు, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, భీమలింగేశ్వరరావు, నాయకులు కాసులమ్మ, రవిప్రసాద్, చిన్నబ్బి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కడదాం

చింతపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో గొందిపాకల పంచాయతీ సమ్మగిరి, తోట మామిడి, తాటి బంద, గొందిపాకలు, రాజుపాకలు,చింతల వీధి, రాజుపాకల గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కడదామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మేనిఫెస్టోను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షులు మోరి రవి, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, జేసీఎస్ కనీ్వనర్ గణబాబు, ఎంపీటీసీలు జయలక్ష్మి, మీనాకుమారి, రూతు, మోహన్‌రావు,మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

పాడేరు: మండలంలోని తుంపాడ, గుజ్జెలి, కించురూ పంచాయతీల పరిధిలోని టీడీపీ పార్టీ చెందిన పలువురు వార్డు మెంబర్లు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వార్డు మెంబర్లు ఈశ్వరనాయుడు, ప్రేమ్‌కుమార్, చిట్టిబాబు, బుజ్జిబాబుతో పాటు వందమంది కార్యకర్తలకు అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశేశ్వరరాజు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, నేతలు మంగ్లన్నదొర, చిట్టిబాబు, ఏఎంసీచైర్మెన్ సూరిబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బసవన్నదొర, వాణిజ్య విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో టీడీపీ ఖాళీ

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ సింధిపుట్టు, మాకవరం పంచాయతీ గుర్రాలబయలులో జెడ్పీ చైర్‌పర్సన్, అరకు పార్టీ పరిశీలకురాలు జల్లిపల్లి సుభద్ర బుధవారం పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో టీడీపీ పంచాయతీ కన్వీనర్లు కె.లోక్‌నాథ్, ,కె.కామేశ్వరరావు, కె.మల్లేశ్వరరావు, బి.మన్మధరావుతో పాటు 8 కుటుంబాలు ఆమె సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, పరిపాలన నచ్చి వైఎస్సార్‌సీపీలోకి చేరిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగంలను గెలిపించాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షులు పద్మారావు,మండల నేతలు మత్స్యలింగం, మూర్తి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ సీకరిపుట్టు, తొరంగులు, సీకరి గ్రామాలకు చెందిన బీజేపీ పార్టీ నాయకులు వనకుం ఆనందరావు ,వంతాల చిట్టిబాబు, వనుకుం గోవిందరావు, పాంగి సింహాచలం, పాంగి సింహాద్రి, పాంగి గాసన్న, చిన్నయ్యతో పాటు 25 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, ఎంపీపీ బొండా వరహాలమ్మ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగ గెలుపునకు తామంతా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, మాజీ జెడ్పీటీసీలు గంగాభవాని, సూర్యనారాయణ, పార్టీ ఉపాధ్యక్షులు పాంగి సింహాచలం, మాజీ ఎంపిటిసి కృష్ణారావు, నాయకులు అనంతరావు, కనకరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ తట్టవలస గ్రామంలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మండల కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, కన్నమ్మ, సత్యవతి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీని నమ్మితే నట్టేట మునిగినట్టేనని, గ్రహించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని మదీనా చెప్పారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశేశ్వరరాజు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలకు పార్టీ కండువా వేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, నేతలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలకు పార్టీ కండువా వేస్తున్న మదీనా, సత్యవతి, కన్నమ్మ



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ ,ఆనందరావు

గ్రామాల్లో ప్రచార హోరు



పద్మాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఎస్.పెదబయలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ హనుమంతరావు, నాయకులు



దంసరాయి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, నాయకులు



కుంతుర్ల పంచాయతిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు



గెంజిగడ్డలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు



బందపల్లిలో ఈవీఎంలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి



దొరచింతలపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



దొంగల జగ్గారంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



వీఆర్ పురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



రాజవొమ్మంగిలో ప్రచారం చేస్తున్న నాయకులు



జీకే వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



చింతలపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలు



రంపచోడవరంలో ప్రచారం చేస్తున్న నాయకులు



మొల్లేరులో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు



అడ్డతీగలలో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు

అరకులోయ రూరల్/అనంతగిరి/పెదబయలు: అరకు నియోజకవర్గంలో అరకులోయ, అనంతగిరి, పెదబయలు మండలాల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు మాట్లాడుతూ ఈ సందర్భంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మన్య ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. గిరిజనుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అరకులోయ మండలంలోని ఎన్నికల ప్రచారంలో పీఏసీఎస్ డైరెక్టర్ మాదల పుష్ప, సర్పంచ్‌లు సుస్మిత, కళావతి, బొజ్జ, భాస్కరరావు, రాధిక, జ్యోతి, రమేష్, బుట్కి, ఎంపీటీసీ సభ్యులు రాములమ్మ, లలితదేవి, ఆనందకుమార్, రామచందర్, వైస్ ఎంపీపీ సుమాంజలి, రామన్న, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను, సాంబ, సుంద్ర, అర్జున్, తదితరులు పాల్గొన్నారు. అనంతగిరి మండలంలోని ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్‌లు సీతయ్య, పాంగి అప్పారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ, నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.పెదబయలులోని ఎన్నికల ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షులు వంతాల ఆనందరావు , రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, అగ్రో డైరెక్టర్ సన్యాసి. మాజీ జెడ్పీటీసీలు గంగాభవాని, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల/జీకే వీధి/కొయ్యూరు/చింతపల్లి రూరల్: పాడేరు నియోజకవర్గంలో పాడేరు, జి.మాడుగుల, జీకే వీధి, కొయ్యూరు, చింతపల్లి మండలాల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. జగనన్న పాలన దేశానికి మార్గదర్శకంగా మారిందన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజును గెలిపించాలని కోరారు. జి.మాడుగులలోని ఎన్నికల ప్రచారంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్‌లు హనుమంతరావు, రాంబాబు కొండబాబు, మాజీ సర్పంచ్ పండుదొర తదితరులు పాల్గొన్నారు.గూడెం కొత్త వీధిలోని ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్ , వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, సర్పంచ్‌లు లక్ష్మి, సుభద్ర, కాసులమ్మ, ఎంపీటీసీలు నాగమణి, కృష్ణమూర్తి నేతలు అంజీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. యుూరులో ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, సచివాలయ కన్వీనర్ సుధాకర్, పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ జల్లి హోలియారాణి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం/మారేడుమిల్లి/గంగవరం/అడ్డతీగల/చింతూరు/వీఆర్ పురం/రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గంలో రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, చింతూరు, వీఆర్ పురం, రాజవొమ్మంగి తదితర మండలాల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందన్నారు. పోడు భూములపై హక్కులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జగనన్న పాలన దేశానికి ఆదర్శమన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. రంపచోడవరంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ బొజ్జయ్య, పార్టీ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు కాపారపు రూతూ, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, ఉప సర్పంచ్ కన్నబాబు, అనిల్‌కుమార్, వేము తదితరులు పాల్గొన్నారు. మారేడుమిల్లి మండలంలోని ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, ఎంపీపీ సార్ల లలిత కుమారి, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అనిల్ ప్రసాద్ (బాబీ), కో–ఆప్షన్ సభ్యుడు ధర్మరాజు, ఏఎంసీ డైరక్టర్ దూడ స్మిత్, వైస్ సర్పంచ్ వీరబాబు, సత్తి సునీల్, విక్టర్ బన్ను, అనిధీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. గంగవరంలోని ఎన్నికల ప్రచారంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అడ్డతీగల మండలంలో ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. చింతూరు మండలంలోని ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, సర్పంచ్‌లు కన్నారావు, సత్తిబాబు, పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌రెడ్డి, కన్వీనర్లు రామలింగారెడ్డి, కృష్ణ, ఎండీ జిక్రియా, రాజు, మురళి, రాంప్రసాద్, సత్యనారాయణ, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వీఆర్ పురం మండలంలోని ఎన్నికల ప్రచారంలో మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,మాజీ కన్వీనర్ పాడియం గోపాల్ , జేసీఎస్ మండల ఇన్‌చార్జి సత్యనారాయణ, సర్పంచ్ రామారావు, ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకులు మాచర్ల గంగులు, జయరాజ్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి మండలంలోని ఎన్నికల ప్రచారంలో వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, దుర్గాప్రసాద్, వెంకటరమణ, కుశరాజు, సురేష్‌కుమార్, శాంతకుమారి, మూర్తి, రమణ, వీరబాబు, సత్తిబాబు, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ప్రత్యేకత లున్నా దశాబ్దాలుగా వెనకబడి ఉన్న యలమంచిలి నియోజకవర్గం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక దినదినాభివృద్ధి చెందు తోంది. హస్తకళల కాణాచిగా, పరిశ్రమల హబ్‌గా మరింత ప్రగతి సంతరించుకుంది. సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నబాబు నేతృత్వంలో రూ.కోట్లాది నిధులతో పర్యాట కంగా, మౌలిక వసతుల పరంగా, ఉపాధి పరంగా ముందడుగు వేస్తోంది.

యలమంచిలి.. ప్రగతి లోగిలి


రాంబిల్లిలో నిర్మించిన అధునాతన పీహెచ్‌సీ


ఒంపోలులో నిర్మించిన ఆర్‌బీకే

అచ్యుతాపురం : సముద్ర తీరానికి ఆను కొని ఉన్న యలమంచిలి నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి చలవతో సెజ్ ఏర్పాటు చేసిన తర్వాత యలమంచిలి నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షించింది. ఇప్పుడు ఆ మహానేత తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో యలమంచిలి ప్రగతిపథంలో విరాజిల్లుతోంది. పర్యాటక పరవళ్లు, ఏటికొప్పాక ఘన వారసత్వానికి గుర్తింపు, తీర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి, ఊతమిచ్చే ఫిషింగ్ హార్బర్‌తో పాటు అనేక విప్లవాత్మక మార్పులకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ నియోజకవర్గం పరిశ్రమల హబ్‌గా నిరుద్యోగులకు వరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ, నీటి వనరుల్ని ఒడిసిపడుతూ ఇటు రైతులకు, అటు పరిశ్రమలకు నెలవై అభివృద్ధి బాటన పయనిస్తోంది.

ఐదేళ్లలో రూ.కోట్లాది అభివృద్ధి పనులు

మౌలిక వసతుల పెంపు

రహదారులు, చెరువుల అభివృద్ధి

పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు

నాడు శిథిలమైన సర్కారు బడుల స్థానంలో నేడు కార్పొరేట్ హంగులతో చక్కని పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. విద్యారంగంలో చక్కని మార్పు రాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజావైద్యానికి బాసటగా నిలిచాయి. సీఎం జగన్ పాలన ఈ నియోజక వర్గంలో ఒక సువర్ణ యుగంగా చెప్పుకోవచ్చనడంలో ఎటువంటి సందేహం లేదు.

యలమంచిలి : యలమంచిలి పట్టణంలో దీర్ఘకాలిక సమస్యగా మారిన ఫ్లై ఓవర్ నిర్మాణం దాదాపు పూర్తి అయింది. దీంతో పట్టణ ప్రజలు రైల్వే గేట్ వద్ద ఎక్కువ కాలం పాటు నిరీక్షించే సమయం ఇక ఆదా అవుతంది. యలమంచిలి ఆస్పత్రిని మరింత అప్‌గ్రేడ్ చేసి అనేక వసతులు కల్పించారు.

అభివృద్ధికి ఏరువాక మునగపాక

మండలంలోని కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా 21 సచివాలయాలకు గాను రూ.8.8 కోట్లను కేటాయించారు. అలాగే 21 ఆర్‌బీకేలకు ఒక్కో ఆర్‌బీకేకు రూ.22 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం 5 ఆర్‌బీకేలు అందుబాటులోకి వచ్చాయి. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా 39 పనులకు గాను రూ.17 కోట్ల కేటాయించింది. అలాగే నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా 24 పాఠశాలలకు గాను రూ.10 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడతగా 18 పాఠశాలలకు గాను రూ.8 కోట్లు కేటాయించారు. అలాగే 23 ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రూ.16.5 కోట్లు ఖర్చు చేశారు.


మెలిపాకలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

పారిశ్రామికవాడగా అచ్యుతాపురం

అచ్యుతాపురం మండలం పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందింది. 134 పరిశ్రమలు ప్రస్తుతం తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో బ్రాండిక్స్, ఆసియన్ పెయింట్స్, ఎకోహమా వంటి కంపెనీలు నిరుద్యోగులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. పూడిమడకలో రూ.346 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ హార్బర్ నిర్మాణ ప్రాంతానికి చేరుకునేందుకు రహదారి నిర్మాణం పురోగతిలో ఉంది. కొండకర్ల ఆవకు మరిన్ని అదనపు హంగులు కల్పించే విధంగా పర్యాటక శాఖ కృషి చేస్తుంది.


మునగపాకలో రూ.48 లక్షలతో నిర్మించిన బైపాస్ రోడ్డు

వసతులపల్లి రాంబిల్లి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎం వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి పలు అభివృద్ధి పనులు చేయడమే గాక సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాల లబ్ధిదారులకు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తున్నారు. అంతేగాక నాడు-నేడు పథకంలో పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు. పీహెచ్‌సీలను అధునాతనంగా నిర్మించి ఇద్దరేసి వైద్యులను నియమించారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచారు.


కొండకర్ల ఆవలో బోట్లు ఎక్కేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫైబర్ గట్టు


పాఠశాలల్లో ఆకర్షణీయమైన బెంచీలు

టీడీపీ హయాంలో అన్నీ అవకతవకలే...

- టీడీపీ హయాంలో యలమంచిలి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడింది.
- పనులన్నీ అర్ధంతరంగా నిలిచిపోయాయి.
- అచ్యుతాపురం-అనకాపల్లి మార్గ విస్తరణను నిలిపివేశారు.
- యలమంచిలిలో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కాలేదు.
- మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి ఎంపీపీ, జెడ్పీటీసీలను డమ్మీలుగా మార్చారు.
- కొండల్ని పిండి చేసి, గ్రావెల్ దందా నిర్వహించారు.
- పూడిమడక మత్స్యకారులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ విషయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయి.
- తంతడి, రాజన్నపాలెం గ్రామాలకు ఆనుకొని ఉన్న భూమిని బార్క్ కోసం కేటాయించగా, లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు ఉన్నందున పరిహారం లేకుండానే కాలం గడిపారు.
- కొండకర్ల, తంతడి తీరాల పర్యాటక అభివృద్ధిని గాలికొదిలేశారు.


రేబాకలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

సంక్షేమ పథకాల వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	నగదు (రూ. కోట్లలో)
రైతు భరోసా	39,937	207.48
అమ్మ ఒడి	93,947	108.18
చేయూత	15,505	78.49
వైఎస్సార్ ఆసరా	53,222	125.46
వైఎస్సార్ పెన్షన్లు	38,370	10.31
మనబడి నాడునేడు	158	37.74
కాపు నేస్తం	12,027	18.04
వాహన మిత్ర	8,984	8.98
ఆరోగ్యశ్రీ	19,094	41.01
జగనన్న హౌసింగ్	6,901	69.70
సున్నా వడ్డీ	53,207	16.08
జగనన్న చేదోడు	5,516	5.51
విద్యా దీవెన	19,375	45.56

ఇవి కాకుండా...

పాస్టర్‌లు, ఇమామ్	59	రూ.11,58,000
ఈబీసీ నేస్తం	411	రూ.65,39,763
మత్స్యకార భరోసా	423	రూ.42,30,000

ఇవీ అభివృద్ధి పనులు

- అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించి నిధులను మంజూరు చేయించారు.
- ప్రస్తుతం పనులు జోరుగా సాగుతున్నాయి. ఇది యాభై గ్రామాలకు సంబంధించిన సమస్య.
- మునగపాక-పెదపాడు-కశింకోట రహదారుల అనుసంధానం
- మునగపాక-రాజుపేట రహదారి మరమ్మతులు
- యలమంచిలిలో దీర్ఘకాలిక సమస్య అయిన ఫ్లై ఓవర్ పనుల పూర్తి
- పూడిమడక ఫిషింగ్ హార్బర్‌కు సంబంధించి రహదారి పనులు
- కొండకర్ల ఆవలో పర్యాటకుల సౌకర్యార్థం ఎంపీ సత్యవతి సహకారంతో ఫైబర్ జెట్టీ నిర్మాణానికి చొరవ
- ఏసియన్స్ పెయింట్స్ సహ కారంతో అచ్యుతాపురం, మున గపాక మండలాల్లో చెరువుల తవ్వకం, సాగునీటి వనరుల అభివృద్ధి
- యలమంచిలిలో చెరువుల అభి వృద్ధి
- అగ్రి ల్యాబ్‌కు కోటి రూపాయల నిధులు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం
- సెజ్ పునరావాల కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులు


మునగపాకలో సచివాలయం

సంతోషంగా ఉంది



యలమంచిలి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటించాను. గెలిచిన తర్వాత ఆఫీసుకే పరిమితం కాకుండా సీఎం ఆదేశాల మేరకు ప్రజలతో మమేకం అయ్యాం. దీర్ఘకాలిక సమస్య అయిన యలమంచిలి ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేశాం. అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి పనులు దాదాపు పూర్తి కానున్నాయి. యలమంచిలిలో చెరువుల అభివృద్ధి చేపట్టాం.

- యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు), ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

నా మొదటి ఓటు ఎవరికంటే..?

నా ఓటు పథకాలిచ్చే ప్రభుత్వానికే..



మాది ఏఎస్‌ఆర్ జిల్లాలోని కూనవరం మండలంలో గల టేకుల బోరు గ్రామం. నా పేరు జక్కు మధుమతి. వయసు 20 సంవత్సరాలు. నా తండ్రి అనారోగ్యంతో మరణించాడు. నేను, నా తల్లి అనురాధ అమ్మమ్మ చెంతనే ఉంటున్నాం. ప్రభుత్వం అందజేస్తున్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకుంటే ఓటు హక్కు లభించింది. నా విద్యాభివృద్ధికి దోహదపడిన పథకాలకే వేయాలని నిర్ణయించుకున్నాను. సంక్షేమ ఫలాలు ఇస్తున్న ప్రభుత్వం వస్తే వృద్ధులు, పిల్లలు, వితంతువులు, వికలాంగులు ఇలా ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందని నా అభిప్రాయం.

పాడేరు..విలక్షణ తీరు

జిల్లా కేంద్రమైన పాడేరు **చరిత్రకు సాక్ష్యం**గా.. పర్యాటకంగా.. ప్రకృతి **అందాలకు** నిలయంగా ప్రత్యేక గుర్తింపు **పొందింది.** బ్రిటీష్ పాలకులపై పోరాటం **చేసి మాతృ**భూమి కోసం ప్రాణత్యాగం **చేసిన విప్లవ** వీరుడు అల్లూరి సీతారామ**రాజు పేరిట** కొత్త జిల్లాగా ఏర్పాటైంది. **నియోజకవ**ర్గంలో రాజకీయ చైతన్యం **కూడా** ఎక్కువే. ప్రజల తీర్పు విభిన్నం**గా ఉం**టుంది. గత పదేళ్లుగా అధిక**శాతం ఓటర్లు** వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. **గత రెండు** దఫాలు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులే భారీ మెజారిటీతో విజయం సాధించారు. పార్టీ శ్రేణులు నిత్యం ప్రజలతో మమేకమవడం..సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం.. చేపట్టిన అభివృద్ధితో పార్టీకి మరింత పట్టు పెరిగింది. ఈ దఫా ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు విజయావకాశాలు కనిపిస్తున్నాయి.

- పర్యాటకంగా ప్రత్యేక గుర్తింపు
- అల్లూరి పేరిట జిల్లాగా ఖ్యాతి
- వైఎస్సార్‌సీపీ వైపే గిరిజనం





పాడేరు: జిల్లా కేంద్రంగా పాడేరు ఏర్పాటైన నాటి నుంచి ఊహించని స్థాయిలో గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం వల్ల మెజారిటీ ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారు. చంద్రబాబు హయాంలో విడుదలైన బాక్సైట్ తవ్వకాల జీవోపై పోరాటానికి ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షాన నిలిచారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసి గిరిజనుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటుచేసి కార్పొరేట్ వైద్యాన్ని చేరువచేశారు. ఇలాంటివి ఎన్నో శాశ్వత ప్రయోజన కార్యక్రమాలు చేపట్టి గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారు.


మత్స్యరాస విశ్వేశ్వరరాజు (వైఎస్సార్‌సీపీ)


గిడ్డి ఈశ్వరి (టీడీపీ అభ్యర్థి)

చారిత్రక నేపథ్యం

రాజుల కాలానికి ఆనవాళ్లుగా మిగిలిన అత్యంత పురాతన ఆలయాలు, ప్రకృతి అందాలు, పచ్చదనానికి నిలువెత్తుగా ఎన్నో కొండలు, లోయలు పాడేరు సొంతం. 1917లో పాడేరు నియోజకవర్గంలోని మన్యం ప్రాంతంలో అడుగుపెట్టిన అల్లూరి సీతారామరాజు గిరిజనుల పక్షాన నిలబడి బ్రిటీషు వారిపై తిరుగుబావుటా ఎగరవేశారు. ఆ క్రమంలోనే 1922 ఆగస్టులో బ్రిటీష్ ప్రభుత్వానికి చెందిన చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మంప ప్రాంతంలో ఉన్న అల్లూరిని పట్టుకొని రాజేంద్రపాలెం తరలించారు. అక్కడే చెట్టుకు కట్టి కాల్చి చంపారు.


మోదకొండమ్మతల్లి


విశ్వఖ్యాతి పొందిన మేఘాల కొండ


గిరిజనులకు సిరులిచ్చే కాఫీ, మిరియం తోటలు

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	:	2,41,445
పురుషులు	:	1,17, 530
స్త్రీలు	:	1,23, 909
ఇతరులు	:	6

నియోజకవర్గ స్వరూపం

జిల్లాల పునర్విభజనతో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట జిల్లా కేంద్రంగా పాడేరు అవతరించింది. రెండేళ్ల క్రితం వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న పాడేరు నియోజకవర్గానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది 1967లో ఆవిర్భవించింది. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పాడేరు నియోజకవర్గంలో కొన్ని మండలాలను వేరు చేసి, మరికొన్నింటిని కలిపారు. అంతకుముందు పాడేరుతోపాటు జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాలు ఈ నియోజకవర్గంలో ఉండేవి. 2009లో అరకులోయ నియోజకవర్గం ఏర్పడగా హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలను అందులో కలిపారు. చింతపల్లి నియోజకవర్గాన్ని రద్దు చేసి చింతపల్లి, కొయ్యూరు, **గూడెంకొత్తవీధి** మండలాలను పాడేరులో ఉంచారు. **2009 సాధారణ** ఎన్నికల్లో పాడేరు శాసనసభ **స్థానాన్ని** కాంగ్రెస్ కైవసం చేసుకుంది. **చింతపల్లి నియోజక**వర్గంలో అంతకు ముందున్న **రోలుగుంట** మండలం నర్సీపట్నం నియోజకవర్గంలో చేరింది. కొత్తగా ఏర్పడిన పాడేరు నియోజకవర్గంలో మూడు సార్లు ఎన్నికలు జరగ్గా ఒకసారి కాంగ్రెస్, రెండు సార్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు.

- పాడేరు నియోజకవర్గంలోని సామాజిక వర్గాల్లో మొదటి స్థానంలో భగత, రెండో స్థానంలో కొండదొర, మూడవ స్థానంలో వాల్మీకి, తరువాత స్థానంలో ఆదివాసీ (పీవీటీజీ)లున్నారు. 2014, 2019 ఎన్నికల్లో భగత కులానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గిడ్డి ఈశ్వరి (చివర్లో టీడీపీకి మారారు), కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విజయం సాధించారు.

1967లో నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ 5సార్లు, జనతా పార్టీ ఒకసారి, బీఎస్పీ ఒకసారి, టీడీపీ మూడు సార్లు, వైఎస్సార్‌సీపీ రెండు సార్లు విజయం సాధించాయి.

- 1978తో జనతా పార్టీ తరపున గిడ్డి అప్పలనాయుడు కాంగ్రెస్‌కు చెందిన తమర్భ చిట్టినాయుడుపై 2507ఓట్లతో గెలిచారు.
- 2004లో బహుజన సమాజ్ వాదీ పార్టీ (బీఎస్పీ)తరపున లకే రాజారావు విజయం సాధించారు. ఇండిపెండెంట్ అభ్యర్థి సమ్మెట రవిశంకర్‌పై 7555 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఏపీ రాష్ట్ర రాజకీయ చరిత్రలో తొలిసారిగా బహుజన సమాజ్ వాదీ పార్టీ పాడేరు నియోజకవర్గంలో విజయం సాధించడం విశేషం.

రాజకీయ పోరు

- 2009 జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పసుపులేటి బాలరాజు ప్రత్యర్థి అభ్యర్థి గొడ్డేటి దేముడుపై 587 ఓట్ల తేడాతో విజయం సాధించారు.
- 2014లో ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన గిడ్డి ఈశ్వరి ప్రత్యర్థి గొడ్డేటి దేముడుపై 26,243 ఓట్లతో గెలిచారు. అనంతరం 2018లో ఆమె టీడీపీలో చేరారు.
- 2019లో జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ తరపున కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరిపై 42,804 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- ఐదు మండలాలు ఉండగా అన్నిస్థానాల్లో జెడ్పీటీసీ, జి.మాడుగుల మినహా మిగతాఎంపీపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది.

నియోజకవర్గ ప్రత్యేకతలు

- ఏటా మేలో నిర్వహించే పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర రాష్ట్రంలో అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందింది.
- పాడేరు మండలం వంజంగిలో మేఘాల కొండ విశ్వవ్యాప్తి పొందింది.
- జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది.
- చింతపల్లి మండలం లంబసింగి, చెరువులవేనం, తాజంగి రిజర్వాయర్ ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా ఉన్నాయి. ఇక్కడ ప్రతి ఏటా చలి కాలంలో ఒక్కసారైనా సున్నా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి.
- సీలేరు జలవిద్యుత్ కేంద్రం డ్యామ్, గాదిగుమ్మి జలపాతం, అల్లూరి నడయాడిన మంప ప్రాంతాలు పర్యాటకంగా గుర్తింపు పొందాయి.